# సాక్షి
# జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 27 । మార్చి । 2025






### ఓరుగల్లు కళారత్నాలు
ఓరుగల్లు కళాకారులు నాటకరంగంలో విశేష గుర్తింపు తెచ్చుకున్నారు. నేడు అంతర్జాతీయ రంగస్థల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.
- 8లో



### సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి
రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించి అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయ అధికారులు సూచించారు.
- 8లో

### వాతావరణం
గరిష్టం/కనిష్టం
$40.0^0$ / $22.0^0$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.




## న్యూస్‌రీల్

### నేటి ధర్నాను విజయవంతం చేయాలి
**భూపాలపల్లి రూరల్:** ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేడు (గురువారం) సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆరు టీములుగా ఏర్పడి జిల్లాలోని 12 మండలాలు, గ్రామాల్లో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి నేడు కలెక్టరేట్ ఎదుట ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో నాయకులు పోలం రాజేందర్, రాజయ్య, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

### మీనాక్షి నటరాజన్‌ను కలిసిన ప్రకాశ్‌రెడ్డి



**భూపాలపల్లి రూరల్:** ఢిల్లీలోని ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డితో పాటు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విస్లావత్ దేవన్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని పలు సమస్యలపై నటరాజన్‌కు విన్నవించినట్లు తెలిపారు.

### బ్రాహ్మణపల్లి ఆరోగ్య కేంద్రానికి జాతీయస్థాయి సర్టిఫికెట్
**కాళేశ్వరం:** మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధి బ్రాహ్మణపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి జాతీయ ప్రమాణాల సర్టిఫికెట్ గుర్తింపు లభించినట్లు వైద్యాధికారి డాక్టర్ సుస్మిత తెలిపారు. బుధవారం జాతీయ ఆరోగ్య వ్యవస్థ వనరుల కేంద్రం, జాతీయ హెల్త్ మిషన్ మినిస్ట్రీ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో ఏడు జాతీయ నాణ్యతా ప్రమాణాల సర్టిఫికెట్ ఎస్సెస్‌మెంట్‌లో భాగంగా బ్రాహ్మణపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి గుర్తింపు లభించింది. మార్చి 10న ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ, ఎన్‌ఆర్‌ఎం ఇండియా అధికారులు వర్చువల్‌గా ఆరోగ్య ప్రమాణాలు, పబ్లిక్ హెల్త్ స్కీం ఫెసిలిటీని పరిశీలించిన విషయం విదితమే. జాతీయస్థాయిలో గుర్తింపు రావడంతో డీఎంహెచ్‌ఓ మధుసూదన్ ఆస్పత్రి సిబ్బందిని అభినందించారు.

### నూతన కమిటీ ఎన్నిక
**భూపాలపల్లి రూరల్:** ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, వరంగల్ రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో భూపాలపల్లి ఆర్టీసీ డిపో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు బుర్రి తిరుమతి తెలిపారు. బుధవారం డిపో ఆవరణలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. డిపో అధ్యక్షుడిగా ఎల్ఆర్‌నాయక్, కార్యదర్శిగా ఎకె.స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, చైర్మన్‌గా శ్రీనివాస్, ట్రెజరర్‌గా పికెస్వామిలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని యూనియన్ నాయకులతో పాటు డిపో మేనేజ ర్ ఇందూ సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మారపల్లి శేఖర్, రీజనల్ ప్రెసిడెంట్ గూడెల్లి దేవేందర్, కొత్త నాగయ్య డిపో సభ్యులు పాల్గొన్నారు.

### ఆస్తిపన్నుపై 90శాతం వడ్డీ రాయితీ
**భూపాలపల్లి రూరల్:** 2024–25 ఆర్థిక సంవత్సరానికి బకాయి పడిన ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీని మినహాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌టైం సెటిల్‌మెంట్ పథకం ద్వారా ఆస్తి పన్ను బకాయిపై గల వడ్డీ 90 శాతం మినహాయింపు ఇచ్చిందని, కేవలం 10శాతం వడ్డీని ఒకేసారి చెల్లించి బకాయి పూర్తి చేసుకోవచ్చన్నారు.

# తాగునీటికి ఇబ్బందులు రానివ్వం

## వేసవిలో నీటి సమస్య వస్తే 8978180036కు ఫోన్ చేయండి

- త్వరలోనే సెంట్రల్ లైటింగ్ మరమ్మతు పనులు
- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన

**భూపాలపల్లి:** వేసవిలో తాగునీటి ఇబ్బంది రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తితే మున్సిపల్ కార్యాలయంలోని కాల్ సెంటర్ 8978180036కు ఫోన్ చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ వెల్లడించారు. పట్టణ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ నిర్వహించగా అనూహ్య స్పందన లభించింది. మున్సిపల్ పరిధిలోని పలువురు తమ సమస్యలను కమిషనర్‌కు ఫోన్‌లో వివరించగా, కొన్నింటిని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.

**ప్రశ్న:** సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగక ప్రమాదాలు జరుగుతున్నాయి.
– ముంజాల రవీందర్, మాజీ కౌన్సిలర్, మంజూర్‌నగర్

**కమిషనర్:** సెంట్రల్ లైటింగ్ మరమ్మతుకు నోచుకున్న విషయాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి తీసుకెళ్లగా డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.1.50 కోట్లు మంజూరు చేయించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.


**ప్రశ్న:** హనుమాన్‌నగర్ సమీపంలోని పోచమ్మగుడి వద్ద డివైడర్ కటింగ్‌ను మరింత వెడల్పు చేయాలి. మెయిన్ రోడ్‌లోని ప్రధాన ఆస్పత్రి, మజీద్ దగ్గర మిషన్ భగీరథ వాటర్ లీకేజీ అయి దుకాణాల ఎదుట నీరు పారుతుంది.
– మహ్మద్ రఫీక్, ఫొటో స్టూడియో యజమాని, హనుమాన్‌నగర్

**కమిషనర్:** డివైడర్ కటింగ్‌ను వెడల్పు చేసే విషయాన్ని ఎన్‌హెచ్ అధికారులకు లేఖ ద్వారా తెలియజేస్తాం. వాటర్ లీకేజీ కాకుండా తక్షణమే చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** సుభాష్‌కాలనీలోని వారసంత జరిగే స్థలం పక్కన సైడ్ కాల్వలు లేక మురుగు నీరు రోడ్డుపై పారుతుంది.
– అనపర్తి లక్ష్మణ్, సుభాష్‌కాలనీ

**కమిషనర్:** డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. తాత్కాలికంగా అక్కడ సిమెంట్ పైపులు వేస్తాం.

**ప్రశ్న:** జంగేడులోని ఓపెన్ జిమ్‌ను మరమ్మతు చేయించాలి



'సాక్షి' ఫోన్ ఇన్‌లో సమస్యలు వింటున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

**ప్రశ్న:** జవహర్‌నగర్‌కాలనీలో తాగునీటి కొరత ఉంది. కొందరు మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మోటార్లు బిగిస్తున్నారు. అంబేడ్కర్ సెంటర్‌లో పార్కింగ్ స్థలం లేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.
– ఎరుకల గణపతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

**కమిషనర్:** వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీలు నిర్వహించి మిషన్ భగీరథ పైప్‌లైన్‌లకు మోటార్లు బిగించే వారిపై కేసులు నమోదు చేయిస్తాం. పట్టణ మాస్టర్ ప్లాన్ సిద్ధం అవుతుంది. త్వరలోనే పార్కింగ్ ఇబ్బందులు తీరుతాయి.

**ప్రశ్న:** ఓసీపీ 2 (పాత కేటీకే 2వ ఇంక్‌లైన్) నుంచి అంబేడ్కర్ మీదుగా బొగ్గు లారీలు వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మిలీనియం క్వార్టర్స్‌లోని పెద్ద రోడ్డు నుంచి కేటీకే 5వ ఇంక్‌లైన్ వరకు సింగరేణి నిర్మించిన రోడ్డు మీదుగా లారీలను నడిపిస్తే ఇబ్బంది ఉండదు.
– గంపల దేవేందర్, సుభాష్‌కాలనీ




**కమిషనర్:** రెండు రోజుల్లో సింగరేణి జీఎం, ఎస్పీ గారికి లేఖ రాసి మిలీనియం క్వార్టర్స్, కేటీకే 5వ ఇంక్‌లైన్ మీదుగా బొగ్గు లారీలు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.
– కూచన కిషన్‌ప్రసాద్, జంగేడు, 14వ వార్డు

**కమిషనర్:** మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ఓపెన్ జిమ్‌ల మరమ్మతుకు ప్రతిపాదనలు పంపిస్తాం.

**ప్రశ్న:** మంజూర్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి గుడి వెనుక కాలనీలో సైడ్ కాల్వలు లేక ఇబ్బంది పడుతున్నాం.
– మంథెన సత్యనారాయణ, పసుల శ్రీనివాస్, వెంకటేశ్వర కాలనీ

**కమిషనర్:** అక్కడ సుమారు 300 మీటర్ల మేరకు సైడ్ కాల్వ నిర్మించాల్సి ఉన్నట్లుగా గుర్తించాం. ఏప్రిల్ నెలలో ఎస్టిమేట్ తయారు చేపిస్తాం.

**ప్రశ్న:** సుభాష్‌కాలనీలో పది లైన్లకు కలిపి ఒకే వాల్వ్ ఉంది. దీంతో మిషన్ భగీరథ నీరు చాలా నెమ్మదిగా, తక్కువగా వస్తున్నాయి.
– చుక్క బాలరాజు, సుభాష్‌కాలనీ.

**కమిషనర్:** నేను స్వయంగా అక్కడికి వచ్చి చూస్తాను. మరో రెండు వాల్వ్‌లను తక్షణమే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటా.

**ప్రశ్న:** శాంతినగర్ 18వ వార్డులో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు పందులకు ఆవాసంగా మారుతున్నాయి.
– ప్రభుదాస్, శాంతినగర్

**కమిషనర్:** ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి స్థలాలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** రెడ్డికాలనీలో చెత్త సేకరణకు ప్రతీరోజు రావడం లేదు.
– రాజేందర్‌రెడ్డి, రెడ్డికాలనీ

**కమిషనర్:** శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పి ప్రతీరోజు చెత్త వాహనాలు వచ్చేలా చూస్తాం.

**ప్రశ్న:** అంబేడ్కర్ సెంటర్ నుంచి ఓసీపీ 2 వరకు నిర్మిస్తున్న రహదారి పనులు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
– భీమనాథుని సత్యనారాయణ, రెడ్డికాలనీ

**కమిషనర్:** ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం చేసేలా చూస్తాం.

**ప్రశ్న:** నోటీసులు ఇవ్వకుండా నా ఇల్లు కూలగొట్టారు.
– పుల్యాల తిరుపతి, సుభాష్‌కాలనీ

**కమిషనర్:** సైడ్ కాల్వ నిర్మించాల్సిన స్థలంలో మీరు ఇంటి నిర్మాణం చేపట్టారు. నోటీసులు ఇచ్చి కొంత మేరకు తొలగించాం. సైడ్ కాల్వ నిర్మాణానికి సహకరించాలి.

**ప్రశ్న:** మంజూర్‌నగర్ మెయిన్ రోడ్డుకు మూడేళ్లుగా పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందించడం లేదు.
– లక్ష్మణ్‌నాయక్, మంజూర్‌నగర్

**కమిషనర్:** ఏఈని పంపించి మిషన్ భగీరథ నీరు అందించేలా చర్యలు తీసుకుంటాం.

## పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ

**గణపురం:** విద్యార్థుల పరీక్షలు ముగిసే వరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్, తాగునీరు, వైద్యసేవలను పరిశీలించి, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వాహన పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించాలని, విద్యార్థుల వెంట ఎల్రక్టానిక్ పరికరాలను ఉండకుండా, మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల తరలింపులో జాగ్రత్తగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సత్యనారాయణస్వామి, సీఎస్, తదితరులు ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

### ఏడుగురి గైర్హాజరు
**భూపాలపల్లి రూరల్:** జిల్లాలో నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కొనసాగుతున్నట్లు డీఈఓ రాజేందర్ తెలిపారు. బుధవారం నిర్వహించిన పరీక్షలో 3,449 మందికి గాను 3,442 మంది విద్యార్థులు హాజరై ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్‌రెడ్డి, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేసినట్లు తెలిపారు.

## ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలి

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

**కాళేశ్వరం:** ఉపాధి పనుల్లో కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలం సమీపించినందున తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఉపాధిహామీ పథకంలో ఆర్థిక సంవత్సరానికి లేబర్ బడ్జెట్ అప్రూవ్ చేసిన పని టార్గెట్‌గా పెట్టుకోవాలన్నారు. కూలీల దినసరి వేతనం రూ.300 లభించేవిధంగా మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ముందస్తుగా కొలతల ప్రకారం పని చేయించాలని ఆదేశించారు. మెట్‌పల్లి, మహదేవపూర్, కాళేశ్వరం అంబట్‌పల్లిలో ఎల్ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈనెలాఖరు వరకు 25శాతం రుసుము రాయితీతో చెల్లించాలన్నారు. పంచాయతీల్లో ఇంటి పన్ను వందశాతం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ వీరభద్రయ్య, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

## పతకాలు సాధించడం అభినందనీయం

**భూపాలపల్లి రూరల్:** జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించడం అభినందనీయమని భూపాలపల్లి సింగరేణి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ అంకిత భావంతో సాధన చేస్తే సాధించలేనిది ఏదీలేదన్నారు. క్రీడలతో పాటు విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగాలు సాధించాలని కోరారు. అలాగే విద్యార్థులకు స్విమ్మింగ్ నేర్పించిన కోచ్ పాక శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం క్రాంతి కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, కోచ్ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. కాగా ఉగాది పండుగ సందర్భంగా సింగరేణి సంస్థ సీఎండీ బలరాం ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలపగా జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అధికారులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్టూఓటూ జీఎం కవీంద్ర, అధికారులు సురేఖ, శ్రావణ్ కుమార్, ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి తదితలరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

## 'రూరల్ ఇండియా' సేవలు అభినందనీయం

ఎస్పీ కిరణ్ ఖరే

**భూపాలపల్లి:** రూరల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నందకుమార్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి పలు పుస్తకాలను అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అటవీ గ్రామాలతో పాటు ఎంపిక ప్రాతిపదికన 19 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటు, స్పోర్ట్స్ కిట్లను సంస్థ వ్యవస్థాపకుడు పూణేకు చెందిన ప్రదీప్ లోకండే అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి నితీష్‌కుమార్, ఎస్పీ సీసీ ఫసియొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి పుస్తకం అందజేస్తున్న నందకుమార్

## సెలూన్ షాపుల బంద్ సంపూర్ణం



ర్యాలీలో పాల్గొన్న నాయీబ్రాహ్మణులు

**భూపాలపల్లి రూరల్:** జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న కార్పొరేట్ సెలూన్‌తో పాటు కార్పొరేట్ వ్యవస్థకు వ్యతిరేకంగా నాయీబ్రాహ్మణులు బుధవారం చేపట్టిన సెలూన్ షాపుల బంద్ సంపూర్ణమైంది. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణులు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజశేఖర్ మాట్లాడుతూ కార్పొరేట్ సెలూన్ వ్యవస్థలో వెనక్కి తగ్గకుంటే రాబోయే రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. నాయీబ్రాహ్మణులకు జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పందిళ్ల రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దుబ్బాక సంపత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ గిరి సమ్మయ్య, మండల అధ్యక్షుడు మంతెన భూమయ్య, నాయకులు వంగపల్లి సుదర్శన్, మురహరి శంకర్, జంపాల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తులు స్వీకరించాలి

**భూపాలపల్లి:** యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థికసాయం అందించడానికి ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం నుంచి మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీయువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సొంత వ్యాపారాల స్థాపనకు ప్రభుత్వం రాయితీ అందించనుందన్నారు. ఈ పథకానికి అర్హులైన వారు అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

# ఓరుగల్లే ఫైనల్..!

### ఇక్కడే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు కేసీఆర్ సై
- తాజాగా ఎల్కతుర్తిలో స్థల పరిశీలన చేసిన నేతలు
- డ్రోన్ కెమెరాలతో సభాస్థలి, పార్కింగ్ స్థలాల మ్యాపింగ్
- కేసీఆర్ దృష్టికి మ్యాప్‌లతో సహా అన్ని వివరాలు
- వేదిక దేవన్నపేటా? ఎల్కతుర్తా.?.. నేడో, రేపో తేల్చనున్న అధినేత



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో రజతోత్సవ సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు

**సాక్షిప్రతినిధి, వరంగల్/ఎల్కతుర్తి :** బీఆర్‌ఎస్ ఉద్యమాలకు సెంటిమెంట్‌గా భావించే ఓరుగల్లులోనే ఏప్రిల్ 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ భారీ సభను నిర్వహించాలన్న తుది నిర్ణయానికి ఆ పార్టీ అధినేత కేసీఆర్ వచ్చారు. ఆయన ఆదేశాల మేరకు బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నాయకులు స్థల పరిశీలన చేశారు. మొదట గ్రేటర్ వరంగల్ పరిధిలోని హంటర్‌రోడ్డు, లేదా ఉనికిచర్లలో నిర్వహించాలని ఈ నెల 10న మాజీ మంత్రి, సభ ఇన్‌చార్జ్ టి.హరీశ్‌రావు స్థల పరిశీలన చేశారు. ఆ తర్వాత హసన్‌పర్తి మండలం దేవన్నపేట అయితే ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉంటుందని భావించి అక్కడ కూడా పర్యటించారు. ఇదే సమయంలో ఈసారి సభను వరంగల్ కాకుండా హైదరాబాద్ శివారులో పెట్టాలన్న చర్చ పార్టీలో జరిగినట్లు ప్రచారం జరిగింది. వేసవి ఎండలు తీవ్రమయ్యే సమయంలో వరంగల్ కంటే హైదరాబాద్ శివారు ప్రాంతమైతే బాగుంటుందని భావించినట్లు సమాచారం. ఘట్‌కేసర్‌లో సభావేదికను ఎంచుకున్నారన్న ప్రచారం కూడా జరిగింది. తాజాగా కేసీఆర్ ఆదేశాల మేరకు బుధవారం మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధి ఎల్కతుర్తిలో స్థల పరిశీలన చేశారు. ఎల్కతుర్తి మండల కేంద్రంతోపాటు గోపాల్‌పూర్, మడిపల్లి, చింతలపల్లి శివార్లు.. ఎల్కతుర్తి – భీమదేవరపల్లి మధ్యన కుడి, ఎడమల స్థలాలను కూడా పరిశీలించారు. ఈ మేరకు రైతులనుంచి అంగీకారపత్రాలు కూడా తీసుకున్నారు.

**ఎల్కతుర్తి సభాస్థలిపై కేసీఆర్‌కు నివేదిక.. నేడో, రేపో నిర్ణయం..**


సభావేదిక వివరాలను గురువారం పార్టీ అధినేత కేసీఆర్‌కు అందజేయనున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు చెప్పారు. సుమారు 15లక్షల మంది వరకు హాజరయ్యే రజతోత్సవ సభ కోసం భారీ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇదే విషయమై ఎల్కతుర్తి మండలంలో నిర్వహించేందుకు పరిశీలించిన రెండు, మూడు స్థలాల వివరాలు, మ్యాప్‌లను పార్టీ అధినేత కేసీఆర్‌కు సమర్పించినట్లు ఆ పార్టీ నేతలు చెప్పారు. కేసీఆర్‌తో చర్చించి ఆయన నిర్ణయం మేరకు సభావేదికపై స్పష్టమైన ప్రకటన వెలువడుతుందని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా.. రజతోత్సవ సభపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్న కేసీఆర్.. నేడో, రేపో ఉమ్మడి వరంగల్ నేతలతో చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

**డ్రోన్ల ద్వారా సభావేదిక మ్యాపింగ్..**


ఎల్కతుర్తి మండల కేంద్రంలో అనువైన ప్రదేశాన్ని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డిలు బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ముల్కనూర్ రోడ్డు, చింతలపల్లి రోడ్డు సమీపంలో గల అనువైన ప్రదేశాన్ని చూసి అనువుగా భావించిన వారు.. డ్రోన్ కెమెరా ద్వారా ఆ ప్రాంతాన్ని మ్యాపింగ్ చేయించారు. ఈ భూమికి సంబంధించిన రైతులతో మాట్లాడగా వారు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా ఎల్కతుర్తికి వచ్చే దారులవెంట కిలోమీటర్ దూరంలో గల ప్రదేశాలను వాహనాల పార్కింగ్ కోసం చూశారు. వారి వెంట పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, మాజీ వైస్‌ఎంపీపీ తంగెడ నగేష్, మాజీ ఎంపీటీసీ కడారి రాజు, శేషగిరి, రవిందర్, చిట్టిగౌడ్ ఉన్నారు.

## లింగాపూర్ సమీపంలో పులి సంచారం

పాదముద్రలను గుర్తించిన అటవీశాఖ అధికారులు



**వెంకటాపురం(ఎం):** మండల పరిధిలోని లింగాపూర్ జాతీయ రహదారి శివారులోని నందిపాడు ప్రాంతంలో మంగళవారం సాయంత్రం పులి సంచరిస్తున్నట్లు గొత్తికోయలు గమనించి లింగాపూర్ గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ మేరకు వారు బుధవారం ఉదయం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ములుగు ఎఫ్ఆర్ఓ శంకర్ అటవీశాఖ సిబ్బందితో కలిసి పులి సంచరించిన ప్రదేశానికి చేరుకుని పరిశీలించారు. ఆ ప్రదేశంలో పులి సంచరించినట్లు పాదముద్రలను గుర్తించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ శంకర్ మాట్లాడుతూ పస్రా రేంజ్ పరిధిలో పులి సంచరిస్తున్నట్లు వెల్లడించారు. లింగాపూర్ పరిధిలోని జాతీయ రహదారి పక్కన కూడా పులి సంచరించినట్లు వివరించారు. పులి పాదముద్రల ఆధారంగా ట్రేస్ చేస్తున్నామన్నారు. ప్రజలు, మేకల కాపరులు అటవీ ప్రాంతంలోకి వెళ్లకూడదన్నారు.



పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

## నాటక రంగంపై నాగరాజుకు మక్కువ..


రాముడి పాత్రలో జూలూరు నాగరాజు(ఫైల్)

వరంగల్ కాశిబుగ్గకు చెందిన జూలూరు నాగరాజు తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నాటక రంగపై మక్కువతో పోతన పీఠం మేనేజర్ జేఎన్‌శర్మ ప్రోత్సాహంతో 2017లో నాటక రంగంలో ప్రవేశించి ఇప్పటి వరకు దాదాపు 100 ప్రదర్శనలు ఇచ్చారు. 2024లో తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన నాటక పోటీల్లో 'విజయానిరుద్ధం' అనే నాటకంలో విశారద పాత్రకు ఉత్తమ హాస్య నటుడిగా అవార్డు అందుకున్నాడు. నాటక రంగంలో బ్రిటీష్ ఆఫీసర్‌గా, రైతుగా, కొడుకుగా, ఊరిదొరగా అనేక పాత్రల్లో నటించి ప్రశంసలందుకున్నారు.


- బ్రిటిష్ అధికారి పాత్రలో నాగరాజు

# ఓరుగల్లు కళారత్నాలు..

**నాటక రంగంలో విశేష గుర్తింపు తెచ్చుకుంటున్న కళాకారులు**

పాత్ర ఏదైనా సులభంగా పోషిస్తున్న మహానటులు

నేడు అంతర్జాతీయ రంగస్థల దినోత్సవం



నాటకం.. సమాజంలో జరిగే యథార్థ ఘటనలకు ప్రతిరూపం. అది మంచి కావొచ్చు లేదా చెడు కావొచ్చు. కళాకారులు ఆయా ఘటనలకు సంబంధించిన పాత్రలు ధరించి ప్రజలను ఆలోజింపచేస్తారు. చైతన్య పరుస్తారు. అందుకే భారతీయ సమాజంలో నాటక రంగానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. క్రీ.పూ నాలుగో శతాబ్దంలోనే భరతముని రచించిన నాట్యశాస్త్రం భారతీయ నాటకానికి ఉన్న ప్రాధాన్యం తెలియజేస్తుంది. ప్రాచీనకాలంలో మహాకవి కాళిదాసు, భవభూతి రచించిన నాటకాలు ప్రసిద్ధి చెందాయి. మార్చి 27 అంతర్జాతీయ రంగస్థల దినోత్సవం. ఈ నేపథ్యంలో ఓరుగల్లు కళాకారులకు నాటక రంగంపై గల ఆసక్తి.. వారు సాధించిన విజయాలు.. ఇతర వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

-హన్మకొండ కల్చరల్

### సమాజానికి మంచి సందేశం..



నాటక రంగంలో పదేళ్ల అనుభవం ఉన్న నటుడు మాలి విజయరాజ్. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చారు. మార్గదర్శి, అన్నదాత, ఏ నిమిషానికి ఏమీ జరుగునో, కనువిప్పు, వైద్యో నారాయణో హరీ, పరివర్తన, ఇదెక్కడి న్యాయం, ధనకాంక్ష తదితర నాటకాలు ప్రదర్శించి ఎన్నో అవార్డులు అందుకున్నారు. సమాజానికి మంచి సందేశం ఇచ్చేది నాటక రంగమని పేర్కొంటున్నారు మాలి విజయరాజ్.

- మాలి విజయరాజ్, నటుడు, దర్శకుడు

### వరంగల్ రంగస్థలం..

కాకతీయుల కాలంలో ఎన్నో రకాల కళారూపాలు ప్రదర్శించేవారని క్రీడాభిరామం, నృత్యరత్నావళి, బసవపురాణం తదితర గ్రంథాల్లో పేర్కొనబడింది. చిందుల వారు, జక్కులవారు, తెరచీరల వారు, పేరిణి, ప్రేంకిణి వంటి ఎన్నో కళారూపాలు ప్రదర్శించేవారని తెలుస్తోంది. వాటిలో చాలా కళారూపాలు ఇప్పటికీ జానపదాల రూపంలో వ్యాప్తిలో ఉన్నాయి. ఆధునిక కాలంలో పౌరాణిక పద్యనాటకాలు రూపొందడానికి చరిత్ర ఉంది. 1940కి పూర్వమే మడికొండ, మొదలైన చోట్ల పద్యనాటక సమాజాలు ఏర్పడ్డాయి. 1943లో పాములపర్తి సదాశివరావు కాకతీయ కళాసమితి స్థాపించి భక్తరామదాసు నాటకం ప్రదర్శించారు. 1965లో శ్రీరాజరాజేశ్వరీ నాట్య మండలి, హిందూ డ్రమెటిక్ అసోసియేషన్ స్థాపించారు. ఆ తర్వాత ఓరుగల్లులో పద్య నాటకాల స్వర్ణయుగం ప్రారంభమైందని చెప్పొచ్చు. ఆజంజాహి మిల్స్ ఆర్ట్స్ అసోసియేషన్, మంజు ఆర్ట్స్ అసోసియేషన్, మారుతి నాట్యమండలి, శ్రీశారదా నాట్యమండలి తదితర అనేక సంస్థలు ప్రారంభమయ్యాయి. ఆజంజాహి మిల్లులో పనిచేసిన జమ్మలమడక కృష్ణమూర్తి శ్రీశారదానాట్య మండలిని ఏర్పాటు చేసి పద్యనాటకాలు ప్రదర్శించారు. వేమూరి శ్రీనివాస మూర్తి హార్మోనియం సహకారం అందించేవారు. మారేడోజు సదానందాచారి పౌరాణిక పాత్రలు పోషించేవారు. పందిళ్ల శేఖర్‌బాబు తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ స్థాపించి వరంగల్ పద్య నాటకానికి రాష్ట్రస్థాయిలో అనేక బహుమతులు వచ్చేలా కృషిచేశారు. మరోవైపు రేకందార్ నాగేశ్వర రావు స్థాపించిన సురభి భానోదయ నాట్యమండలి ఓరుగల్లు పద్యనాటకానికి రంగాలంకరణ సొరభాలు అందించింది.

**నాటక రంగంలో ఓరుగల్లు కళాకారులు ప్రతిభ..**

భారతీయ సంప్రదాయ నృత్యాలు, నాటక కళలకు ఓరుగల్లు పుట్టిల్లు. ఈ నేపథ్యంలో మన కళాకారులు వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలిస్తూ పలువురు ప్రముఖులతో అవార్డులు, మన్ననలు పొందుతున్నారు. నిత్యం సాధన చేస్తూ పోటీల్లో ప్రతిభ చాటుతున్నారు. ఏదో ఒక పనిచేస్తూనే ఖాళీ సమయంలో వేదికలపై తమ నాటకాలు ప్రదర్శిస్తూ కళారత్నాలుగా విశేష గుర్తింపు తెచ్చుకుంటూ ప్రశంసలందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మన కళాకారులకు నటక రంగంపై గల ఆసక్తి, సాధించిన విజయాలు, ఇతర వివరాలను తెలుసుకుందాం.

### యువతను ప్రోత్సహించాలి..


సమ్మక్క, సారలమ్మ నాటకంలో మేడరాజుగా జేఎన్ శర్మ(ఫైల్)



నాటకరంగాన్ని కాపాడుకోవాలంటే యువతను ప్రోత్సహించాలని కోరుతున్నారు ఓరుగల్లుకు చెందిన సీనియర్ కళాకారుడు, పోతన పీఠం మేనేజర్ జేఎన్ శర్మ. 60 ఏళ్లుగా నాటక రంగంలో ఏ పాత్రనైనా సులభంగా పోషించగలుగుతున్న మహానటుడు శర్మ. ఓరుగల్లు శారదా నాట్యమండలిని స్థాపించి ఎందరినో కళాకారులుగా తయారు చేసి ప్రోత్సహిస్తున్నారు. దధిచి, మహానటుడు, ఫ్రీడం ఫైటర్, సమ్మక్క,సారలమ్మ తదితర వందలాది నాటకాలు ప్రదర్శించారు.

- జేఎన్ శర్మ

### పూర్వవైభవం తీసుకురావాలి..



నాటకరంగానికి పూర్వవైభవం తీసుకురావడంలో యువత కృషి చేయాలని వరంగల్‌కు చెందిన కళాకారుడు, రిటైర్డ్ టీచర్ కుసుమ సుధాకర్ కోరుతున్నారు. సుధాకర్.. 1978లో వేముల ప్రభాకర్ దర్శకత్వం వహించిన 'పంజరంలో చిలక ' తన మొదటి ప్రదర్శనతో నాటక రంగంలోకి అడుగుపెట్టారు. ఇప్పటి వరకు 100పైగా నాటకాలు ప్రదర్శించారు. ఆగండి కొంచెం ఆలోచించండి, కాళోజీ నారాయణరావు, తదితర నాటకాల్లో భావోద్వేగాలు పండిస్తూ తనదైన ముద్ర వేశారు.

- కుసుమ సుధాకర్


కాళోజీ నారాయణరావు పాత్రలో సుధాకర్(ఫైల్)

### నాటకాలతో ఆత్మవిశ్వాసం..


మహానటుడు నాటకంలోని సన్నివేశంలో రమేశ్(ఫైల్)



సాంఘిక, పౌరాణిక నాటకాల నటుడు, రచయిత గొట్టె రమేశ్ వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయుడు. ఆరేళ్లుగా నాటకరంగంలో వివిధ ప్రదర్శనలు ఇస్తూ ఆకట్టుకుంటున్నారు. మహానటుడు, దధిచి, ఫ్రీడం ఫైటర్, సమ్మక్క, సారలమ్మ తదితర నాటక ప్రదర్శనలు ఇచ్చారు. నాటకాలు మనిషిలో ఆత్మవిశ్వాసంతో పాటు నైతిక,ధార్మిక భావాలను కలిగిస్తాయని అంటారు గొట్టె రమేశ్.

- గొట్టె రమేశ్

### ఓరుగల్లు చరిత్రకారులకు నిలయం..



ఓరుగల్లుకు అద్భుత ఖ్యాతి ఉందని, చరిత్రకారులు, సాహితీవేత్తలకు, కళాకారులకు నిలయమని సోల్జర్ షఫీ పేర్కొంటున్నారు. భారత సైన్యంలో సైనికుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వరంగల్‌కు చెందిన సోల్జర్ షఫీకి నాటకాలు అంటే ఎనలేని ప్రేమ. ప్రస్తుతం పంజాబ్ నేషనల్ బ్యాంకులో క్యాషియర్ ఉద్యోగం చేస్తున్నారు. బ్యాంకు వారు నిర్వహించే కార్యక్రమాల్లో వరంగల్ తరఫున పాల్గొని జాతీయస్థాయిలో ఎన్నో బహుమతులు అందుకున్నారు. ఫ్రీడం ఫైటర్, నీరా ఆర్య, జమీలాబాయ్, మహానటుడు, చల్‌చల్ గుర్రం నాటకాలకు దర్శకత్వం వహించారు.

- సోల్జర్ షఫీ


నాటకంలోని ఓ సన్నివేశంలో సోల్జర్ షఫీ (ఫైల్)

## క్లుప్తంగా

### గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడని..

**తండ్రిపై కుమారుడు, కోడలు దాడి**

- తీవ్రంగా గాయపడిన వృద్ధుడు
- బమ్మెరలో ఘటన


చికిత్స పొందుతున్న సోంమల్లు

పాలకుర్తి టౌన్: భూ వివాదం నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడనే కోపంతో తండ్రిపై కుమారుడు, కోడలు దాడికి పాల్పడిన ఘటన పాలకుర్తి మండలం బమ్మెరలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ వైద్యం చేయించుకోవడానికి చేతిలో చిల్లి గవ్వ లేక కొడుకులకు రాసిచ్చిన భూమి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని ఈనెల 25న తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో గ్రామానికి చెందిన దుంప సోంమల్లు ఫిర్యాదు చేశాడు. తండ్రి బయటకు వెళ్లిన కొద్ది సేపటికే పెద్ద కుమారుడు వచ్చి తన భూమిని విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అప్పటికే వృద్ధుడి గోడు విని చలించిన తహసీల్దార్ శ్రీనివాస్.. తండ్రికి ఇస్తాన్నన డబ్బు ఇవ్వలేని పక్షంలో ముగ్గురి కుమారుల పేరిట చేసిన భూ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తానని హెచ్చరించాడు. తండ్రి ఇవ్వాల్సిన డబ్బు రూ.3 లక్షలు ఇచ్చేది లేదని బుధవారం చిన్న కుమారుడు ఐలయ్య, కోడలు ఐలమ్మ.. సోంమల్లుపై దాడికి పాల్పడ్డాడరు. ఈ ఘటనలో సోంమల్లు తల పగిలింది. వెంటనే చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, సోంమల్లు నెల క్రితం తనకు న్యాయం చేయాలని జిల్లా లీగల్ సర్వీస్‌లో కూడా ఫిర్యాదు చేశాడు.

### పర్యావరణ సమతుల్యత పాటించాలి

- కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: వనరులను సంరక్షించుకునేందుకు,పర్యావరణ సమతుల్యతను పెంపొందించుకునేందుకు మెటీరియల్ సైన్స్ దోహదపడుతుందని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో 'ఇంటర్ డిసిప్లినరీ మెటీరియల్స్ సైన్స్ ఫర్ సస్టేనబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్మెంట్ (ఎన్‌సీఐఎంఎస్ఎస్ఈఈ-2025)' అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సు బుధవారం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలు సృజనాత్మక ఆలోచనలతో సుస్థిరాభివృద్ధిలో భాగం కావాలని, వివిధ రకాల నైపుణ్యాల్ని వినియోగించుకోవాలని సూచించారు. వరంగల్ ఎన్ఐటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి.హరినాథ్, సదస్సు కన్వీనర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.అరుణ, ఎన్వైకే డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్.అన్వేశ్, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కో-కన్వీనర్ కవిత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేశ్‌బాబు, అకడమిక్ కో-ఆర్డినేటర్ అరుణ, అధ్యాపకులు హెప్సిబా, ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.



## అవినీతి అధికారులకు శిక్షపడాలి

- లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ
- ఏసీబీకి పట్టించిన పౌరులకు సన్మానం


యువకులను సన్మానిస్తున్న జయప్రకాశ్ నారాయణ

హన్మకొండ చౌరస్తా: లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారులకు శిక్షపడేలా పటిష్ట చట్టాలు అమలు చేయాలని, అప్పుడే అవినీతి తగ్గుతుందని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారా యణ అభిప్రాయపడ్డారు. జ్వాలా స్వచ్ఛంద సంస్థ, లోక్‌సత్తా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో లంచం ఆశించిన అధికారులను ఏసీబీకి పట్టించిన పౌరులను బుధవారం సన్మానించారు. హనుమకొండలోని కల్యాణి ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి జయప్రకాశ్ నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజం నుంచి లంచం అనే మహమ్మారిని సమూలంగా నిర్మూలించాలంటే రాజకీయాలు, చట్టాల్లో చాలా మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. రూ. వందల కోట్లతో పోటీ చేసే ధోరణి పోవాలని, ఇటీవల హైకోర్టు జడ్జి ఇంట్లో నోట్ల కట్టలు బయటపడడం కలిచివేసిందన్నారు. ఏసీబీని ఆశ్రయించి అవినీతి అధికారులను పట్టించే యువత మరింత ముందుకు రావాలన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెంది విజయ్, శివరాజ్, కమలాపూర్‌కు చెందిన గోపాల్ సన్మానించి ఒక్కొక్కరికి రూ.5వేల నగదు పురస్కారం అందజేశారు. లోక్‌సత్తా సంస్థ సలహాదారుడు కోదండరామారావు, జ్వాలా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ప్రశాంత్, అంజలీదేవి, పర్యావరణ ప్రేమికుడు ప్రకాశ్, సీకేఎం కళాశాల రిటైర్డ్ అధ్యాపకుడు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ ఏడీఈల సీనియారిటీ రెడీ..

**తాత్కాలిక జాబితాలో 70 మందికి చోటు**

- ఇందులో ఇప్పటికే ముగ్గురికి పదోన్నతి
- ప్రమోషన్లకు తొలుగుతున్న అడ్డంకులు
- ఏడీఈలకు డీఈలుగా పదోన్నతులు ఇస్తే.. ఏఈలకు లైన్ క్లియర్


టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసేందుకు యాజమాన్యం కసరత్తు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ల తాత్కాలిక సీనియారిటీ జాబితా ఎట్టకేలకు రూపొందించింది. ఇప్పటికే ఇంజనీర్ల అసోసియేషన్ నాయకులతో విస్తృత సంప్రదింపులు జరిపి, చర్చించి రూపొందించిన జాబితాపై మరోసారి అభ్యంతరాలకు అవకాశం కల్పించింది. తాత్కాలిక జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే 15 రోజుల్లో తెలిపేందుకు అవకాశం కల్పించింది. ఈ తాత్కాలిక జాబితా ఈ నెల 25వ తేదీన రాత్రి విడుదల చేసింది. ఈ లెక్కన ఏప్రిల్ 8వ తేదీలోపు అభ్యంతరాలు తెలపాల్సి ఉంటుంది. అనంతరం పూర్తి స్థాయిలో తుది జాబితా రూపొందిస్తారు.

**ఇప్పటికే 10 మంది వరకు ఏఈల రిటైర్డ్..**

టీజీ ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతుల కోసం ఏడీఈలు, ఏఈలు కొంతకాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ ప్రక్రియ జాప్యమవుతున్న క్రమంలో ఏఈలు ఒక్కొక్కరుగా రిటైర్డ్ అవుతున్నారు. ఇప్పటికే 10 మంది వరకు రిటైర్డ్ అయ్యారని ఇంజనీరింగ్ వర్గాలు తెలిపాయి. ఇంకా ఆలస్యమైతే మరికొంత మందికి అన్యాయం జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందు ఏడీఈలకు డివిజనల్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పిస్తే ఖాళీలు పెరిగే అవకాశముంది. దీంతో పదోన్నతి కోసం ఎదురు చూస్తున్న ఆశావహులైన ఏఈలకు ఎక్కువ సంఖ్యలో పదోన్నతులు లభించే అవకాశముంది.

**70 మందితో ఏడీఈల తాత్కాలిక సీనియారిటీ..**

ఏడీఈల తాత్కాలిక సీనియారిటీ జాబితా 70 మందితో రూపొందించారు. ఇందులో ఇప్పటికే ముగ్గురు పదోన్నతి పొందారు. వీరిలో ఇప్పట్లో అందరికి పదోన్నతి లభించే అవకాశం లేదు. సీనియారిటీ ప్రకారం డీఈ పోస్టులు ఖాళీ అవుతున్న కొద్దీ జాబితాలో పేర్కొన్న సీనియారిటీ ప్రకారం క్రమంగా పదోన్నతి లభించనుంది. ఏడీఈల సీనియారిటీ జాబితాతో తమకు కూడా పదోన్నతి కల్పిస్తారని ఏఈలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అసోసియేషన్ నాయకులు పట్టుదలకు పోకుండా పదోన్నతి ప్రక్రియ సజావుగా, త్వరగా ముగిసేలా సహకరించాలని ఆశావహులు కోరుతున్నారు.

## కంకుల గూడు


మక్కజొన్న పొత్తులతో రూపొందించిన ఇల్లు

పచ్చటి మొక్కజొన్న పంట మధ్య అందమైన కంకుల గూడు అబ్బురపరుస్తోంది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో పొన్నం నర్సయ్య అనే రైతు చేనులో ఓ విత్తన కంపెనీవారు.. పబ్లిసిటీ కోసం ఇలా మక్కపొత్తులతో ఇల్లు కట్టారు. చుట్టూ కాంపౌండ్ తిప్పారు. రోడ్డు వెంట వెళ్లే వారు ఈ మక్క గూడును ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- నర్సంపేట

## మూల్యాంకనంలో నిబంధనలు పాటించాలి

- డీఐఈఓ శ్రీధర్ సుమన్



మాట్లాడుతున్న డీఐఈఓ శ్రీధర్‌సుమన్

వరంగల్: ఇంటర్మీడియట్ మూల్యాంకనంలో నిబంధనలు పాటించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, వరంగల్ క్యాంప్ ఆఫీసర్ శ్రీధర్ సుమన్ అన్నారు. బుధవారం వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాల ఆడిటోరియంలో మూల్యాంకన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టుల మూల్యాంకన సిబ్బందితో మాట్లాడారు. మూల్యాంకనంలో కచ్చితంగా సమయ పాలన పాటించాలన్నారు. బయోమెట్రిక్ హాజరు నేపథ్యంలో అందరూ సకాలంలో హాజరుకావాలన్నారు. వరంగల్, మహబూబాబాద్, ములుగు జిల్లాల మూల్యాంకన సిబ్బందికి ఆయా స్పెల్ వారీగా శిక్షణఇచ్చి మూల్యాంకనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూల్యాంకనాన్ని బోర్డు అధికారులు కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పరిశీలిస్తున్నారని, సకాలంలో స్పాట్ వాల్యుయేషన్ పూర్తి చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో సహాయక క్యాంపు అధికారులు మాధవరావు, విజయ నిర్మల, కార్యాలయ సిబ్బంది రఫీ తదితరులు పాల్గొన్నారు.

### కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగి..

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- తెలియక అదే కూల్‌డ్రింక్ తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్న తల్లి
- కొత్తూరు(సీ)లో ఘటన

కురవి: ఓ యువకుడు కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాగా, పురుగుల మందు కలిపిన విషయం తెలియని అతడి తల్లి అదే కూల్‌డ్రింక్ తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన చుట్టుపక్కల వారు ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సీరోలు మండలం కొత్తూరు (సీ)గ్రామానికి చెందిన కొత్త శేఖర్ బుధవారం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగాడు. అనంతరం బాటిల్ ఇంట్లో పెట్టగా ఇది తెలియని అతడి తల్లి సరోజన తాగింది. దీంతో ఇద్దరు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చుట్టు పక్కల వారు మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు వివరించడానికి శేఖర్ నిరాకరించాడు. ఈ విషయంపై ఎస్సై నగేశ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

### నేడు తరాలపల్లికి సారయ్య మృతదేహం

కాజీపేట అర్బన్ : ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం మావోయిస్టులు, భద్రతాదళాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన అంకేశ్వరపు సారయ్య మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనలో సారయ్య కుటుంబ సభ్యులు బుధవారం తెల్లవారుజామున ఛత్తీస్‌గఢ్ వెళ్లారు. అక్కడి కాంకేర్ ఆస్పత్రి నుంచి సారయ్య మృతదేహాన్ని తీసుకుని బయలుదేరారు. గురువారం తెల్లవారుజాము వరకు తరాలపల్లికి చేరవచ్చు. ఉదయం 11 గంటలకు సారయ్య అంతిమయాత్ర నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

## సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ

ఖిలా వరంగల్: రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించి అధిక దిగుబడులు పొందాలని వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. వరంగల్ నక్కలపల్లి రహదారిలోని జీఎం కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ వరకు జరిగే రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓ) మేళా బుధవారం రెండు రోజు కొనసాగింది. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని స్టాళ్లను తిలకించారు. మేళాలో సేంద్రియ సాగు, విత్తనాలు, పంట సాగు, యాంత్రీకరణ సాగు, ఉద్యాన పంటలు, తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. నూతన పనిముట్లను రైతులకు పరిచయం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఏఓ మాట్లాడారు. రైతులు ఆధునిక సాంకేతికత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, యంత్రీకరణ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారి(డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్) రమన్ సింగ్, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, నాబార్డు ఏజీఎం రవి, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వరంగల్ చీఫ్ మేనేజర్లు గిరిబాబు, శివప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, కేవీకే శాస్త్రవేత్తలు సాయి కిరణ్, సౌమ్య, జన్యు శాస్త్రవేత్తలు వెంకన్న, సంధ్య కిశోర్, సంగీతలక్ష్మి, ఏడీఏ యాకయ్య, ఏఓ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మినీ జాతర ఆదాయం రూ.1.08 కోట్లు

- హుండీ కానుకల లెక్కింపు చేపట్టిన అధికారులు


కానుకలను జల్లెడ పడుతున్న సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం మినీ జాతరలో భక్తులు అమ్మవార్లకు సమర్పించిన హుండీల కానుకలను బుధవారం లెక్కించారు. మేడారంలోని ఎండోమెంట్ కార్యాలయ డార్మెటరీ భవనంలో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజుల పూజారుల సమక్షంలో ఈఓ రాజేంద్రం పర్యవేక్షణలో కానుకలు లెక్కించారు. ఇందులో సమ్మక్క హుండీ ఆదాయం రూ. 58,66,409, సారలమ్మ ఆదాయం రూ. 45,61,892, పగిడిద్దరాజు ఆదాయం రూ. 1,61,003, గోవిందరాజు హుండీ ఆదాయం రూ. 2,13,863 మొత్తం రూ. 1,08,03,173 ఆదాయం వచ్చినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. భక్తులు విదేశీ డాలర్లు సమర్పించినట్లు పేర్కొన్నారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కానుకల లెక్కింపు వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, ఇన్‌స్పెక్టర్ కవిత, తదితరులు పాల్గొన్నారు.